క్లుప్తంగా

ఎన్నికల ప్రచారాలకు అనుమతులు తప్పనిసరి

• తహసీల్దార్ చిరంజీవి



మనుబోలు : రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారాలు చేసుకునేందుకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలని తహసీల్దార్ చి రంజీవి తెలిపారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉ న్నందున రాజకీయ పార్టీలు, వారి అనుచరులు నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఇంటింటి ప్రచారాలకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఆర్ఓ నుంచి 48 గంట ముందే అనుమతి తీసుకోవాలని సూచించారు. సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా అనుమతి పొందవచ్చని తెలిపారు. ప్రజల నుంచి అభ్యంతరాలు వస్తే ఆ ప్రాంతంలో ప్రచారం నిలిపివేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కోడ్‌ను అనుసరించి ప్రచారం చేసుకోవాలని రాజకీయ పార్టీలకు సూచించారు.

శేషజీవితం హాయిగా గడపాలి



ముత్యాల రమేష్‌ను సన్మానిస్తున్న అధికారులు

కోవూరు : పదవీ విరమణ జీవతంలో భాగమని, శేషజీవితం హాయిగా గడపాలని పడుగుపాడు ఆర్టీసీ వర్క్స్ మేనేజర్ షమీం అన్నారు. పడుగుపాడు ఆర్టీసీ వర్క్‌షాప్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ముత్యాల రమేష్ పదవీ విరమణ కార్యక్రమం బుధవారం రాత్రి వర్క్‌షాపులో జరిగింది. ఈ సందర్భంగా సహ ఉద్యోగులు, అధికారులు రమేష్‌ను ఘనంగా సన్మానించారు. రాబోయే రోజుల్లో రమేష్ ఆరోగ్యంగా జీవించాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు.

నిబంధనల మేరకే మద్యం విక్రయాలు

• జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి



నాగమల్లేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో ఎన్నికల నియమ, నిబంధనలకు లోబడి మద్యం విక్రయాలు చేపట్టాలని, నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కే నాగమల్లేశ్వరరెడ్డి జీఆర్వో సిబ్బంది, బార్ యాజమాన్యాలను హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలను ఆయన బుధవారం 'సాక్షి'కి వెల్లడించారు. ఎన్నికల్లో రాజకీయపార్టీలు మద్యంతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉందన్నారు. దీనిని పూర్తిస్థాయిలో కట్టడిచేసేందుకు పక్కాప్రణాళికలతో ముందుకెళుతున్నామన్నారు. జిల్లాలోని 193 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 53 బార్ అండ్ రెస్టారెంట్ల యాజమాన్యాలతో ఇటీవల సమావేశం నిర్వహించి ఎన్నికల సందర్భంగా అనుసరించాల్సిన నియమ, నిబంధనలను వివరించామన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులు సమయపాలన విధిగా పాటించాలన్నారు. దొడ్డిదారిన విక్రయాలు సాగిస్తే చర్యలు తప్పవన్నారు.

గతేడాది వలే..

ఈ నెల 16న ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఐఎంఎల్ డిపోలో ప్రభుత్వ, బార్ అండ్ రెస్టారెంట్లకు గతేడాది మార్చి 16 నుంచి 31వ తేదీ వరకు, ఏప్రిల్, మే నెలల్లో ఎన్ని కేసుల మద్యం, బీర్లు సరఫరా చేశామో అదే దామాషా ప్రకారం ఈ ఏడాది అందజేస్తున్నామని తెలిపారు. ఒక్క సీసా కూడా అదనంగా ఇచ్చేది లేదన్నారు. గతేడాది మార్చి 16 నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోని బార్ అండ్ రెస్టారెంట్లకు 75,324 మద్యం కేసులు, 22,232 బీర్ కేసులను సరఫరా చేశామని తెలిపారు. ఈఏడాది సైతం అంతే మొత్తంలో మద్యాన్ని సరఫరా చేశామని చెప్పారు. ప్రతిరోజూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో స్టాక్ వెరిఫికేషన్ నిర్వహిస్తామన్నారు. అందుకు సంబంధించిన నివేదికను ఎప్పటికప్పుడు ఎన్నికల సెల్‌తో పాటు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. మద్యం దుకాణాల సిబ్బంది, బార్ల యాజమాన్యాలు ఎన్నికల నియమ, నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు.

స్ట్రాంగ్‌రూంకు పటిష్ట ఏర్పాట్లు

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డితో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రాల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. వారి వెంట జేసీ సేతు మాధవన్, కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్, అదనపు ఎస్పీ సౌజన్య, జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, రెవెన్యూ డివిజనల్ అధికారి మలోల, రెవెన్యూ, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఇంట సిరుల పంట



బ్రహ్మదేవిలో యంత్రాలతో వరి కోతలు

సర్వేపల్లి నియోజకవర్గంలో వరిసాగు	
మండలం	ఎకరాలు
ముత్తుకూరు	8,918
పొదలకూరు	8,000
మనుబోలు	16,000
వెంకటాచలం	12,250
తోటపల్లిగూడూరు	9,790

- కలిసొచ్చిన రబీ వరి సాగు
- నాలుగున్నర పుట్ల దిగుబడి
- పుట్టి ధాన్యం ధర రూ.21,500

ముత్తుకూరు : రబీ సీజన్ కింద చేపట్టిన వరిసాగు.. రైతు ఇంట సిరులు నింపింది. రికార్డు స్థాయిలో దిగుబడులు రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత నవంబరులో మిచాంగ్ తుపాను దెబ్బకు వరి నార్లు, విత్తనాలు నీట మునిగాయి. రైతులు డీలా పడిపోయారు. అయితే, ప్రభుత్వం వెంటనే సబ్సిడీపై వరి విత్తనాల సరఫరా ముమ్మరం చేయడంతో సాగు కాస్త ఆలస్యమైనా డిసెంబరులో నాట్లు వేసుకున్నారు. మరో వైపు జనవరిలో మంచు కురిస్తే పైరు అగ్గితెగులు బారిన పడుతుందని, తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు బెంగ పెట్టుకున్నారు. అయితే, ఈ సీజన్‌లో తెగుళ్ల ఎటువంటి నష్టాలను కలిగించలేదు. రసాయన మందుల వినియోగం కూడా పెద్దగా జరగలేదు. సాగు ఆలస్యం కావడంతో దిగుబడి ఏ విధంగా ఉంటుందోనని రైతులు ఆందోళనలో పడ్డారు. కానీ, వరి కోతలు మొదలై నాణ్యమైన ధాన్యం చేతికి రావడంతో పాటు ఎకరాకు 4.5 పుట్ల ధాన్యం దిగుబడి రావడం రైతును సంతోషంలో ముంచెత్తింది. ఒక ఎకరాకు రూ.25,000ల నుంచి రూ.30,000ల వరకు పెట్టిన ఖర్చు వృథా పోలేదు.



ముత్తుకూరులో లారీలో లోడ్ చేస్తున్న ధాన్యం

పుట్టి ధాన్యం రూ.21,000ల పైమాటే

గత సంవత్సరం రబీ సీజన్ కోతల సమయంలో బీపీటీ రకం పుట్టి రూ.17,500ల నుంచి రూ.18,000ల వరకు అమ్మకాలు జరిగాయి. అయితే, ప్రస్తుతం కోతల దశలో పుట్టి రూ.21,000లకు పైగా అమ్మకాలు జరగడం పట్ల రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మెరుగైన ధరలు లభిస్తాయన్న ఉద్దేశంలో ధాన్యం ఆరబెట్టుకుని ప్రభుత్వం ఇటీవల నిర్మించిన గిడ్డంగుల్లో భద్రపరుచుకునే పనిలో పడ్డారు.

ఆలస్యమైనా మంచి దిగుబడి



అకాల వర్షాల వల్ల రబీ వరి సాగు ఆలస్యంగా మొదలైంది. అయితే, అనూహ్యంగా ఎకరాకు 4.5 పుట్ల దిగుబడి రావడం సంతోషదాయకం. కొన్నిచోట్ల ఎకరాకు ఐదు పుట్ల దిగుబడి వచ్చినా ఆశ్చర్య పడనక్కరలేదు.

– దువ్వూరు చంద్రశేఖరరెడ్డి, రైతు, డీవీపాళెం

మందుల ఖర్చులు మిగిలాయి



రబీ సీజన్ వరి సాగు రైతులకు సంతోషాలను ఇచ్చింది. దిగుబడి ఒక వైపు, ధరలు మరో వైపు ఆశాజనకంగా ఉన్నాయి. ముఖ్యంగా మందుల వినియోగం తగ్గడం వల్ల రైతుకు ఖర్చు మిగిలింది.

– కట్టా సుబ్రహ్మణ్యం, రైతు, బ్రహ్మదేవి

ధాన్యం నిల్వ చేసుకుంటే మంచిది



ముత్తుకూరు మండలంలో ప్రస్తుతం బీపీటీ రకం నాలుగున్నర పుట్లకుపైగా, కేఎన్ఆర్ 1638 రకం నాలుగు పుట్లకుపైగా దిగుబడి వస్తోంది. వసతి ఉండి నిల్వ చేసుకుంటే మంచి ధరలు లభిస్తాయి.

– జ్యోత్స్నరాణి, మండల వ్యవసాయాధికారి

ఊరూవాడా ఘన స్వాగతం



మొగళ్లూరులో గజమాలతో మంత్రిని సత్కరిస్తున్న నాయకులు

పొదలకూరు : ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందిన సంక్షేమం, జరిగిన అభివృద్ధితో సర్వేపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఊరూవాడా అపూర్వ స్వాగతం లభిస్తోంది. ఈ క్రమంలో మండలంలోని మొగళ్లూరు, కనుపర్తి, నరసింహకండ్రిక, గురవాయపాళెం గ్రామాల్లో మంత్రి కాకాణి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామంలో మహిళలు మంత్రికి హారతులు ఇచ్చి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో చరిత్రలో ఎన్నడూ జరగని అభివృద్ధి ఐదేళ్లలో చేపట్టినట్లు వెల్లడించారు. ప్రజలకు ఏది అవసరమో తెలిసిన నాయకుడిగా గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రధానంగా పేదలు సాగు చేసుకుంటున్న భూములకు అసైన్మెంట్ పట్టాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. మంత్రి వెంట యనమల శ్రీనివాసులురెడ్డి, యాతం పెంచలరెడ్డి, ఆకుల పెదగంగిరెడ్డి, చెన్నూరు గంగిరెడ్డి, ఆకుల గంగిరెడ్డి, గండవరం సురేంద్రరెడ్డి, నీలం ప్రసాద్ రెడ్డి, నాగేళ్ల శ్రీనివాసులునాయుడు, ఆలుపూరు పాపయ్య, నాగేళ్ల రమేష్‌నాయుడు, మాల్యాద్రి, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పది పరీక్షలు

మనుబోలు : పదో తరగతి పరీక్షలు మండలంలో బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. మనుబోలులోని జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో అదే పాఠశాల విద్యార్థులతో పాటు మడమనూరు, వీరంపల్లి, అక్కంపేట, బద్దెవోలు, శుశ్రుత ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పది పరీక్షలు రాస్తున్నారు. చివరి రోజు సోషల్ స్టడీస్ పరీక్షకు బాలుర పాఠశాలలో 121 మందికి గానూ 81 మంది హాజరవగా 40 విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే బాలికల హైస్కూల్లో 210 మందికి గానూ 208 మంది పరీక్ష రాయగా ఇద్దరు గైర్హాజరయ్యారు. పరీక్షలను చీఫ్ ఆఫ్ ఎగ్జామినర్లు కాంతారావు, వసంత కుమారి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు శ్రీహరి, కుమార్ పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై అజయ్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ఓటు ప్రాముఖ్యతను తెలుసుకోవాలి

విడవలూరు : ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని స్వీప్ నోడల్ ఆఫీసర్ పీవీ రత్నం అన్నారు. స్థానిక పీఆర్ఆర్-వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు ఆవశ్యకతపై బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఓటును తప్పకుండా వినియోగించుకోవాలని, ఇంకా ఎవరైనా ఓటు నమోదు చేసుకోకుంటే వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు ఎస్.రవిశంకర్‌రెడ్డి, కె.హరి, సీఆర్పీ మల్లేశ్వర్‌రెడ్డి, సీసీ రాజశేఖర్, కళాశాల అధ్యాపకులు పి.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మల్లూరులో కాకాణి ఎన్నికల ప్రచారం నేడు

ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండలంలోని మల్లూరు, దువ్వూరువారిపాళెం, వల్లూరు పంచాయతీల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ప్రచారంలో నాయకులు, అభిమానులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

నేడు నర్సారెడ్డికాలనీలో ఇంటింటి ప్రచారం

పొదలకూరు : మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత పట్టణంలోని నర్సారెడ్డికాలనీలో గురువారం సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి బుధవారం తెలిపారు. కాలనీలో ప్రతి గడపకు వెళ్లి ఐదేళ్ల అభివృద్ధిని వివరిస్తారన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాల్సిందిగా కోరారు.

చంద్రశేఖరపురంలో వైద్య శిబిరం

కొడవలూరు : మండలంలోని చంద్రశేఖరపురంలో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి రక్త గ్రూపు పరీక్షలు, హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. రక్తశాతం తక్కువగా ఉన్న వారిని గుర్తించి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ రక్త గ్రూపు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అత్యవసర వైద్య సేవలందించాల్సిన సందర్భంలో రక్త గ్రూపు తెలిసి ఉండడం ఎంతో అవసరమని వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నీతిమాలిన రాజకీయాలు తగవు

కొడవలూరు: 2014 ఎన్నికలకు ముందు రూరల్ మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పరిస్థితి ఎంటో గుర్తు చేసుకోవాలని, ప్రస్తుతం డబ్బు తీసుకుని నీతిమాలిన రాజకీయాలు చేయడం తగదని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెం దిన్నెలో బుధవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. 2014కు ముందు శ్రీధర్‌రెడ్డి బజాజ్ చేతక్ స్కూటర్, అద్దె ఇంట్లో ఉండేవారని, జగన్ భిక్ష పెడితే ఎమ్మెల్యే అయ్యారని తెలిపారు. ప్రస్తుతం శ్రీధర్‌రెడ్డికి రూ.25 కోట్ల బంగ్లా, రూ.30 కోట్ల షాపింగ్ మాల్, రూ.10 కోట్ల ఆఫీసు ఇలా వందల కోట్ల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని ప్రశ్నించారు. జగన్ పుణ్యం వల్లే రెండు సార్లు ఎమ్మెల్యే అయ్యానని, తాను మరణిస్తే దహన సంస్కారాలకు జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనాలని స్వయంగా పలు పర్యాయాలు ప్రకటించిన విషయాన్ని శ్రీధర్‌రెడ్డి గుర్తించుకోవాలన్నారు. వేమిరెడ్డి వద్ద డబ్బు తీసుకొని కోవూరు ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, ఎంపీటీసీ పి.అనిల్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ కొండా శ్రీనివాసులురెడ్డి, నాయకులు ఎన్.మాణిక్యరావు, పి.మధుసూదన్‌రెడ్డి, ఎం.రంగారెడ్డి, జి.జనార్ధన్‌రెడ్డి, కె.మోహన్‌రావు, కృష్టారెడ్డి, పి.ఖుధు పాల్గొన్నారు.



నార్తురాజుపాళెంలో ప్రచారం చేస్తున్న చలపతిరావు

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్

ఇందుకూరుపేట : గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతకు చెక్ పెట్టొచ్చని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కిశోర్, బ్రహ్మేశ్వర నాయుడు కోరారు. మండలంలోని జగదేవిపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ ఆధ్వర్యంలో రక్తహీనత గురించి బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు సుక్రోస్ ఇంజెక్షన్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ మాధవ, సీహెచ్ఓ నందిని, ఏఎన్ఎం కల్పవల్లి, హెల్త్ సెక్రటరీ ధనలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఆరోగ్యంపై అవగాహనకు కళా ప్రదర్శనలు

నెల్లూరు(అర్బన్): ప్రజారోగ్యవేదిక ఆధ్వర్యంలో సాంస్కృతిక కళారూపాల ద్వారా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆ వేదిక రాష్ట్రాధ్యక్షుడు డాక్టర్ ఎంవీ రమణయ్య తెలిపారు. ఇందుకు సంబంధించి నగరంలోని రామచంద్రారెడ్డి ఆస్పత్రిలో ప్రజాకళాకారుల నాయకులతో బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వైద్యం ఖరీదుగా మారిపోవడం బాధాకరమన్నారు. ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఎక్కువ శాతం జబ్బులు రావన్నారు. ప్రాథమిక వైద్యంతోనే ఎక్కువ శాతం జబ్బుల నుంచి కోలుకోవచ్చన్నారు. ప్రతి అనారోగ్య సమస్యకు స్పెషలిస్టు డాక్టర్లు అవసరం లేదన్నారు. అందువల్లనే ఆరోగ్యంపై సాంస్కృతిక రంగాన్ని సాధనంగా చేసుకుని జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కళాప్రదర్శనలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు విజయకుమార్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎంవీ రమణయ్య

ఘనంగా ప్రపంచ రంగస్థల దినోత్సవం

నెల్లూరు(బృందావనం): ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో నర్తకి సెంటర్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా రంగస్థల కళాకారుడిగా పేరుప్రతిష్టలు గడించిన సీనియర్ కళాకారుడు మహేష్‌ను ఘనంగా సన్మానించారు. రంగస్థల ప్రతిష్టను కళాకారులెందరో తమ నాటకాల ద్వారా పెంచి నాటకరంగానికి చేసిన కృషిని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ప్రస్తావించారు. బుల్లితెరనటుడు శింగంశెట్టి మురళీమోహన్‌రావు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్ వివిధ సంస్థలకు చెందిన నిర్వాహకులు బాలాజీ, లక్ష్మీపతి, రఘు, రాము, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ రంగస్థల కళాకారుడు మహేష్‌కు సత్కారం

జనరంజక పాలన జగన్‌తోనే సాధ్యం

ఇందుకూరుపేట : జనరంజక పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సాధ్యమని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ కోరారు. మండలంలోని డేవిస్‌పేట గ్రామంలో స్థానిక నాయకులు మేనాటి ప్రసాద్, వెంకటరమణయ్యతో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధి అందించారన్నారు. ఆయనను మరోసారి ఆశీర్వదిస్తే దేశంలోనే ఏపీ అగ్రగామిగా నిలుపుతారని విజయ్‌కుమార్ తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



పొదలకూరు : విఘ్నేశ్వరపురం కాలనీలో ఇంటింటి ప్రచారం చేస్తున్న పూజిత

కాలనీల్లో అభివృద్ధి పనులు

పొదలకూరు : పట్టణంలోని కాలనీల్లో తన తండ్రి ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి చరిత్రాత్మకమని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత పేర్కొన్నారు. పట్టణంలోని విఘ్నేశ్వరపురం కాలనీలో బుధవారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని కాలనీల్లో సిమెంటు రోడ్లు, సైడ్ డ్రెయిన్లను రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. నివేశన స్థలాలు లేని పేదలకు జగనన్న కాలనీల్లో స్థలాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఆమె వెంట వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు జి.లక్ష్మీకల్యాణి, షేక్ షాకీరాబేగం, వార్డు సభ్యులు హరి, భాస్కర్, అంజాద్, మూలి సతీష్‌కుమార్‌రెడ్డి, హేమంత్, నాయకులు ఎం.శేఖర్‌బాబు, మద్దిరెడ్డి రమణారెడ్డి, జి.వేణుగోపాల్‌రెడ్డి, కుంకు సురేష్, ఎం.రవికుమార్, జి.గోపాల్‌రెడ్డి, పి.శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడో వార్డులో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని మూడో వార్డు పలు కాలనీల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు కోడూరు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్నివర్గాల ప్రజలకు మేలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసుకునేందుకు నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆదిశేషయ్య, చలపతి, మానస, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట : డేవిస్‌పేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న విజయ్‌కుమార్



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: సంక్షేమ పథకాలను వివరిస్తున్న పార్టీ నేతలు

పూటకో పార్టీ వారి నైజం

ఇందుకూరుపేట : పూటకో పార్టీ మార్చే నైజం దేవిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిది అని, అలాంటి వ్యక్తికి కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు లేదు అని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బీవీ రమణయ్య, ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ నిలదీశారు. మండలంలోని డేవిస్‌పేట గ్రామంలో వారు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రజల కోసం వందలాది ఎకరాలు వదులుకున్న ఎమ్మెల్యే ప్రసన్నను దేవిరెడ్డి విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. సోమరాజుపల్లి గ్రామస్తులు నీకు రాజకీయ సమాధి కట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నేతలు జలీల్, కృష్ణ ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.